గడప గడపలో సంక్షేమ వేడుకలు



గ్రామస్తులకు పథకాల గురించి వివరిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

రామచంద్రాపురం: జగనన్న ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపలోనూ వేడుకను తెచ్చాయని చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం గంగిరెడ్డిపల్లి పంచాయతీ తోకగుట్ట ఇండ్లు, గంగిరెడ్డిపల్లి, గంగిరెడ్డిపల్లి హరిజనవాడ, పద్మవల్లిపురంలో గడప గడపకు మీ హర్షిత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడికే పరిష్కరించారు. రానున్న ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరించి గెలిపించాలని కోరారు. ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీరాణి, వైఎస్సార్ సీపీ నాయకులు దామోదర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఆర్సీపురం ఇన్‌చార్జి గణపతి నాయుడు, మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు చంద్రశేఖర్‌రెడ్డి, మునీంద్రబాబు, రాజేష్, డివిజన్ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, బాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అంబేడ్కర్ యువజన సంఘం ప్రారంభం

తిరుపతి కల్చరల్: తిరుపతి రూరల్ ఓటేరులో ఆదివారం ఏపీ అంబేడ్కర్ యువజన సంఘాన్ని ప్రారంభించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాజ్ తెలిపారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ ఆశయాల సాధన కోసం పోరాడతామన్నారు.

మాజీ సైనికులకు త్వరలో ఇంటి స్థలాలు

- సైనికుల సంక్షేమానికి కృషి
- ఘనంగా అమర జవాన్ స్థూపం ఆవిష్కరణ
- పాల్గొన్న ఇన్‌చార్జి మంత్రి ఉషశ్రీ చరణ్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,
- జెడ్పీ చైర్మన్, కలెక్టర్, ఎస్పీ



అమరజవాన్ స్థూపం ఆవిష్కరణలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉషశ్రీ చరణ్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : దేశ సేవలో ప్రాణాలు విడిచిన అమరువీరులు ఎంతో మంది మన జిల్లాలో ఉన్నారని, వారి సేవలు శ్లాఘనీయమని విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సైనిక సంక్షేమ శాఖ, మాజీ సైనిక సంక్షేమ శాఖ సభ్యులు ఇచ్చిన విన్నపం మేరకు త్వరలో సైనికులకు మూడు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్‌కు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తిరుత్తణి బస్టాండు వద్ద అమర జవాన్ స్థూపం ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత జాతీయ జెండాను ఆవిష్కరించి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ మాజీ సైనికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. చిత్తూరులో అమరవీరుల సేవలకు గుర్తుగా స్మారక స్థూపం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్థూపం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

సైనికులు, మాజీ సైనికుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఇన్‌చార్జి మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. సైనికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను ఇస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో మృతి చెందిన 23 మంది అమర జవాన్‌లను సేవలను గుర్తుచేసుకుంటూ స్థూపం వద్ద ఏటా నాలుగు రోజులు సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో ఏడు వేల మంది సైనికులు ఆర్మీలో పనిచేస్తున్నారని చెప్పారు. కలెక్టర్ ఎస్.షణ్మోహన్ మాట్లాడుతూ మాజీ సైనికుల ఇళ్ల స్థలాల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. త్వరలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ఎస్పీ రిశాంత్ రెడ్డి మాట్లాడుతూ సైనికులు, మాజీ సైనికుల సమస్యలను పోలీసు శాఖ తరుపున పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. సైనిక సంక్షేమశాఖ రాష్ట్ర డైరెక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇటీవల కాలంలోచిత్తూరు జిల్లాకు చెందిన ముగ్గురు సైనికులు విధి నిర్వహణలో అసువులు బాశారని తెలిపారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో స్పందించి ఒక్కో కుటుంబానికి రూ. 50 లక్షలు మంజూరు చేసిందన్నారు జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, నగర మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్ రాజేష్‌రెడ్డి, కార్పొరేటర్ షర్మిల, సైనిక సంక్షేమ శాఖాధికారి విజయశంకర్‌రెడ్డి, మాజీ సైనిక సంక్షేమ సంఘం సభ్యులు పళని, సిద్ధయ్య, వరదరాజులు, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మాజీసైనికులు, వారి కుటుంబసభ్యులు



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,700
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,451
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,200
రిటైల్ వెండి గ్రాము	రూ.74.20

వేదిక్ వర్సిటీలో అత్యాధునిక తాళపత్ర స్కానర్

తిరుపతి సిటీ: శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఫ్రాన్స్ నుంచి దిగుమతి చేసుకున్న అత్యాధునిక తాళపత్ర స్కానర్‌ను శుక్రవారం టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి, జేఈఓ సదాభార్గవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ శ్రీవేకటేశ్వర తాళపత్ర పరిశోధన సంస్థ దేశంలోనే అతిగొప్ప సంస్థగా ఎదగాలన్నారు. దానికి టీటీడీ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణీ సదాశివమూర్తి, రిజిస్ట్రార్ డాక్టర్ ఏవీ రాధేశ్యామ్, డీన్లు గోలి సుబ్రహ్మణ్యశర్మ, డాక్టర్ ఫణియాజులు, తాళపత్ర విభాగాధిపతి విజయలక్ష్మి, పీఆర్వో బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు.

కేంద్ర ఆరోగ్య పథకాల్లో అవకతవకలు వాస్తవమా?



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : దేశంలో అమలవుతున్న కేంద్ర ఆరోగ్య పథకాల్లో ఆర్థిక అవకతవకలు వాస్తవమేనా అని ఎంపీ గురుమూర్తి ప్రశ్నించారు. శుక్రవారం ఢిల్లీ పార్లమెంట్ సమావేశాల్లో ఆయన కేంద్రప్రభుత్వంపై ప్రశ్నల పరంపర సంధించారు. పథకాల్లో ఆర్థిక అక్రమాలు గుర్తించి నిరోధించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను వినియోగించాలని భావిస్తున్నారా అని అడిగారు. ఆస్పత్రుల్లో పథకాల అమలును తనిఖీ చేసి దోషులపై తీసుకున్న చర్యలను వివరించాలని కోరారు. దీనిపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి మాన్సుక్ మాండవీయ సమాధానమిచ్చారు. నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు ఇటీవల న్యూఢిల్లీలోని ఎయిమ్స్ కేంద్రంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంపై అన్వేషిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే ఆయుష్మాన్ భారత్ అమలు చేస్తున్న నేషనల్ హెల్త్ అథారిటీ, ప్రధాన మంత్రి - జన్ ఆరోగ్య యోజన, నేషనల్ యాంటి ఫ్రాడ్ యూనిట్ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బైక్ దొంగల అరెస్ట్

తిరుపతి క్రైం : తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో బైక్‌లు చోరీ చేస్తున్న నలుగురు బాలురను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు క్రైమ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. వారి నుంచి రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. బాలురు నలుగురు ముఠా ఏర్పడి ఒంటరిగా వెళుతున్న వారిని బెదిరించి దోచుకునేవారని వివరించారు. నిందితులను జువైనల్ హోమ్‌కు తరలించినట్లు తెలిపారు.

జీవో 107ను రద్దు చేయాలి

తిరుపతి కల్చరల్: జీవో 107 వల్ల మెడికల్ సీట్ల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని, దాన్ని వెంటనే రద్దు చేయాలని సమతా సైనిక్ దళ్ నేతలు డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి గండి కోట సుబ్రమణ్యం శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. గతంలో 15 శాతం ఆలిండియా కోటాగా, మిగిలిన 85 శాతం రాష్ట్ర ప్రభుత్వం మెరిట్ రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా భర్తీ చేసేదని తెలిపారు. జీవో 107 ప్రకారం 85 శాతం సీట్లలో 50 శాతం ధనిక వర్గాలకు చెందిన విద్యార్థులే పొందడానికి వీలు ఉందన్నారు. రాబోయే మూడేళ్లలో ఒక్కొక్కటి 150 సీట్లతో 17 కొత్త మెడికల్ కళాశాలలు అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ క్రమంలో 107 జీవో వల్ల ఎస్సీలు 170, ఎస్టీలు 68, బీసీలు 228, మైనారిటీలు 58 ఇలా 544 సీట్లు నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. జీవో 107ను రద్దు చేసి అందరికీ న్యాయం చేయాలని కోరారు.

'పండుగ' సంబరం



పోలేరమ్మతల్లి ఆలయం వద్ద నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు

వెంకటగిరిరూరల్ : వెంకటగిరి పోలేరమ్మతల్లి జాతరను రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎన్‌జీఆర్ భవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అడిగిన వెంటనే వెంకటగిరి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో వెంకటగిరి రాజాలతో చర్చించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా గతంలో కంటే మెండుగా పోలేరమ్మ జాతర నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం త్రిభువని సెంటర్‌లోని దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ క్రమంలోనే9 పోలేరమ్మతల్లి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వీట్స్ పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ దొంతు శారద, పార్టీ పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, వైస్ చైర్మన్ ఎస్.బాలయ్య, ఆర్టీసీ రీజనల్ కమిటీ మాజీ చైర్మన్ చెలికం శంకర్‌రెడ్డి, విబ్ పూజారి లక్ష్మి, మహిళావిభాగం అధ్యక్షులు ధనియాల రాధ, పార్టీ జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, జేసీఎస్ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, న్యాయవాది ఎల్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రేట్ బాంబే సర్కస్ ప్రారంభం



తిరుపతి కల్చరల్: ఇండియా, ఇథియోపియా, చైనీస్, రష్యా ఆటగాళ్లతో ఆసియాలోనే అతి పెద్ద సర్కస్ కంపెనీ గ్రేట్ బాంబే వారు డీబీఆర్ రోడ్డులోని యాలమూరి పార్కులో ఏర్పాటు చేసిన సర్కస్ శుక్రవారం రాత్రి తిరుపతిలో ఘనంగా ప్రారంభమైంది. నిర్వాహకులు సంజయ్, ఇలియాజ్ ఖాన్, రమేష్ మాట్లాడుతూ ప్రతి రోజూ మధ్యాహ్నం ఒంటి గంట, సాయంత్రం 4 గంటలు, రాత్రి 7 గంటలకు ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. రూ.100లు, రూ.200లు, రూ.300లు టికెట్ ధరలు ఉన్నాయన్నారు. సర్కస్‌ను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

భూమిని కబ్జా చేస్తున్నారు

తిరుపతి కల్చరల్: నకిలీ పత్రాలు సృష్టించి తమ భూమిని కబ్జా చేయాలని కొందరు చూస్తున్నారని, న్యాయం చేయాలని రేణిగుంట మండలం అన్నాస్వామిపల్లె రైతులు మోహన్, గోపాలకృష్ణ, సుబ్బయ్య కోరారు. వారు శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తమకు తాతముత్తాతల నుంచి అన్నాస్వామిపల్లె గ్రామ లెక్క దాఖలా సర్వే నంబర్లు 341/1లో 3 ఎకరాలు, 341/2లో 1.66 ఎకరాల భూమి వారసత్వంగా వస్తోందన్నారు. తిరుపతి జీవకోనకు చెందిన కొందరు భూమిలోకి దౌర్జన్యంగా ప్రవేశించి బోర్డు ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ విషయాన్ని తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఆధారాలు తీసుకురమ్మని పోలీసులు చెప్పినా వారు వినలేదన్నారు.

దివ్య దక్షిణ జ్యోతిర్లింగ యాత్ర

- ఆగస్టు 23, సెప్టెంబర్ 5న ప్రారంభం
- రెండు రైళ్ల ఏర్పాటు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కిషోర్ సత్య ఆనందం

తిరుపతి అర్బన్: భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ నేతృత్వంలో భారత్ గౌరవ టూరిస్ట్ రైలును ఏర్పాటు చేశారని ఆ సంస్థ జాయింట్ జనరల్ మేనేజర్ కిషోర్ సత్య ఆనందం తెలిపారు. శుక్రవారం తిరుపతి రైల్వే స్టేషన్ వీఐపీ చాంబర్‌లో మీడియా సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. సామాన్య మధ్యతరగతి ప్రజలు జ్యోతిర్లింగాలను సందర్శించడానికి అనుకూలంగా ×దివ్య దక్షిణ్ యాత్ర℃ పేరుతో టూరిస్ట్ రైలును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ , తమిళనాడు, కేరళ ప్రాంతాల్లోనే యాత్రికుల కోసం దక్షిణ దివ్య క్షేత్రాలను, జ్యోతిర్లింగాలను సందర్శించడానికి ఐఆర్‌సీటీసీ ఈ అవకాశాన్ని కల్పించిందని చెప్పారు. సౌకర్యవంతమైన రైలు ప్రయాణంతోపాటు అన్ని వసతులు కలిస్తున్నట్టు తెలిపారు. చెప్పారు. తిరువణ్ణామలై (అరుణాచలం), మధురై, కన్యాకుమారి, త్రివేంద్రం, తిరుచ్చి, తంజావూరులోని ముఖ్యమైన పుణ్యక్షేత్రాలు, పలు పర్యాటక ప్రదేశాల సందర్శనకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. తెలంగాణలోని సికింద్రాబాద్, ఖాజీపేట, వరంగల్, ఖమ్మంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట రైల్వే స్టేషన్ నుంచి ప్రయాణికులు ఈ రైలును ఎక్కవచ్చన్నారు. ఆగస్టు 23 నుంచి 9 రోజులు, సెప్టెంబర్ 5 నుంచి 9 రోజులు రెండు రైళ్లు ఏర్పాటు చేశామని, ఎవరికి ఏది అనుకూలమో దానిని ఎంచుకోవచ్చన్నారు. ఎకానమీ కేటగిరీకి (స్లీపర్ క్లాస్) రూ.14300, స్టాండర్డ్ కేటగిరి(3 ఏసీ) రూ 21,900, కంఫర్ట్ కేటగిరి (2ఏసీ) రూ 28500 జీఎస్టీతో కలిపి నిర్ణయించామని వెల్లడించారు. టికెట్ బుకింగ్ వివరాల కోసం ఫోన్ నెంబర్ 8287932313, 8287932315 సంప్రదించాలని సూచించారు. తొలుత ఆయన ఈ రైళ సమాచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఏరియా మేనేజర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

వరిని ఆశిస్తున్న మొవ్వ తొలిచే పురుగు

తిరుపతి అర్బన్: జిల్లాలో వరిపంట వెన్నుకు వస్తున్న దశలో మొవ్వ పురుగు/కాండం తొలిచే పురుగు ఆశిస్తోంది. ఈ పురుగు ఆశించడం వల్ల అక్కడక్కడా తెల్ల వెన్నులు కనిపిస్తున్నాయి. దీని నివారణకు రైతులు వివిధ రకాలైన మందులను పిచికారీ చేస్తున్నారు. అయితే వాస్తవానికి, ఈ పురుగు నిర్మూలనకు పైరు లేతగా ఉన్నప్పుడే పిచికారీ చేయాలి. వెన్నుదశలో పిచికారీ చేస్తే ఫలితం ఉండదు. ఈ పురుగు నివారణ చర్యలు చిరుపొట్ట దశకు ముందే తీసుకోవాలి. వెన్ను దశలో మందులను వరిపిలకల మొదళ్లలో కొట్టడం సాధ్యం కాదు మందులు పంట మీద కొట్టినా, కాండము లోపల ఉన్న పురుగుకు ఏమీ కాదు. రైతులు దీనిని దృష్టిలో ఉంచుకుని పంటను కాపాడుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మెరుగు భాస్కరయ్య తెలిపారు.

శ్రీవారి ఆలయ సమీపంలో విమానం



తిరుమల: శ్రీవారి ఆలయ సమీపంలో శుక్రవారం ఉదయం విమానం మరోమారు వెళ్లింది. ఆగమశాస్త్ర నియమం ప్రకారం తిరుమలపై ఎటువంటి విమానాలు వెళ్లకూడదు. తరచూ తిరుమల పైభాగంలో విమానాలు వెళుతున్నాయి. దీనిపై టీటీడీ భద్రతాధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

జల్లంత.. తుళ్లింత

తిరుపతి తుడా: నగరంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి అక్కడక్కడా కొంతసేపు చిరుజల్లులు పడ్డాయి. 10 నిమిషాల పాటు ఒక్కో ప్రాంతంలో వర్షం కురిసింది. మధ్యాహ్నం 3.30 గంటలకు శ్రీనివాసం, ఆర్టీసీ బస్టాండ్, 4 గంటలకు తిరుచానూరు రోడ్డు, రేణిగుంట రోడ్డు, 4.30 గంటల ప్రాంతంలో అలిపిరి రోడ్డు, సాయంత్రం 6 గంటలకు గాంధీ రోడ్డు, తిరుమల బైపాస్ రోడ్డు, టౌన్ క్లబ్ కూడలి ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. ఒక్కో టైంలో ఒక్కోచోట వర్షం పడడం ప్రజలకు కొత్త అనుభూతినిచ్చింది. అధిక ఎండలు, ఉక్కపోతతో అల్లాడిన జనానికి ఉపశమనమిచ్చింది.



తిలక్ రోడ్డులో కురుస్తున్న వర్షం



పల్లెవీధిలో..

క్రెడాయి ప్రాపర్టీ ఎక్స్‌పో-23 ప్రారంభం


క్రెడాయి ప్రాపర్టీ ఎక్స్‌పో-23ను ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: ఎయిర్ బైపాస్ రోడ్డులోని పీఎల్ఆర్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన క్రెడాయి ప్రాపర్టీ ఎక్స్‌పో -23ను శుక్రవారం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఆశలకు అనుగుణంగా సొంతింటి కల నెరవేర్చుకునేందుకు పరికరాలను అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు. మేయర్ శిరీష, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే.బాబు, బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి, క్రెడాయి ప్రతినిధులు రాంప్రసాద్, శ్రీనివాసులు, రాజేష్‌బాబు, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువతదే ప్రధాన పాత్ర


తిరుపతి: మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు


రామచంద్రాపురం : ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధి హామీ సిబ్బంది

తిరుపతి సిటీ: ఎస్వీ అగ్రికల్చర్ కళాశాలలో శుక్రవారం నా భూమి, నా దేశం, నేల తల్లికి నమస్కారం, అమరవీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. అసోసియేట్ డీన్ జి.ప్రభాకర్ రెడ్డి విద్యార్థులతో కలిసి పది రకాల పండ్ల మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో నా భూమి, నా దేశం పంచప్రాణ ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

తిరుపతి సిటీ: దేశాభివృద్ధిలో యువతదే ప్రధాన పాత్ర అని పద్మావతీ మహిళా వర్సిటీ వీసీ భారతి తెలిపారు. వర్సిటీ ఆవరణలో శుక్రవారం నా భూమి, నాదేశం, నేలతల్లికి నమస్కారం, అమరవీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సుమారు 75 రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజిని, ఎన్ఎస్ఎస్ బ్యూరో కోఆర్డినేటర్ విద్యావతి, డీన్లు సుజాత, అనూరాధ, కాత్యాయిని తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

రామచంద్రాపురం: అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఉపాధిహామీ ఏపీవో హంసవేణి అన్నారు. మండలంలోని నెన్నూరు, దేశూరికండ్రిగ, సొరకాయలపాలెం, ఎన్ఆర్ కమ్మపల్లి గ్రామాల్లో శుక్రవారం నా భూమి, నా దేశం, నేలతల్లికి నమస్కారం, అమరవీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మహ్మద్‌రఫీ, ఉపాధి సిబ్బంది మమత, రమేష్, సుదర్శన్, ఆరోగ్య, నాగరాజు పాల్గొన్నారు.

పాకాలలో

పాకాల: మండలంలోని వల్లివేడులో శుక్రవారం నా భూమి, నా దేశం, నేలతల్లికి నమస్కారం, అమరవీరులకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు మెంబర్ బండపల్లి రమేష్ అధ్వర్యంలో సైనికుల త్యాగానికి గుర్తుగా 75 మొక్కలు నాటి శిలాఫలకాన్ని స్థాపించారు. విశ్రాంత సైనికులు నాగయ్య, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా పాలు సరఫరా

పాకాల: మండలంలోని ఎంపీపీ పాఠశాలల్లోని విద్యార్థులకు ఈ-పాలగుట్టపల్లికి చెందిన సంఘ సంస్కర్త అపర్ణ ఉచితంగా పాలు సరఫరా చేస్తున్నారు. ఎంఈఓ-1 బాబ్జీ, ఎంఈఓ-2 లింగయ్య శుక్రవారం మాట్లాడుతూ సంఘ సంస్కర్త అపర్ణ మండలంలోని రమణయ్యగారిపల్లి, ఈ-పాలగుట్టపల్లి, కొండేపల్లి, కృష్ణాపురం గ్రామాల్లోని విద్యార్థులకు ఉచితంగా పాలను అశ్వగంధ పొడితో కలిపి సరఫరా చేస్తున్నారని వివరించారు. సర్పంచ్ యువరాజు, హెచ్ఎం యువరాజులు, ఉపాధ్యాయులు ఉదయ్‌కుమార్, మధుమోహన్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు సులోచన, మాధవి, రేవతి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

రేపు ఉచిత గుండె వైద్య శిబిరం

తిరుపతి తుడా: తిరుపతి రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని యూవీ కార్డియాక్ కేర్ హాస్పిటల్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం హాస్పిటల్‌లో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు అధినేత డాక్టర్ వికాష్ తెలిపారు. ఉచిత కన్సల్టేషన్, బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేస్తామన్నారు. 50 శాతం రాయితీతో ఈసీఓ, టీఎంటీ పరీక్షలు చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి వారు 9493071188లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

జగన్ పాలనలోనే ముస్లింలకు పెద్ద పీట


మహ్మద్‌కాసీమ్, రజాక్, లక్ష్మీనారాయణ, అశోక్‌రెడ్డిని సత్కరిస్తున్న ముస్లింలు

తిరుపతి మంగళం: రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ముస్లింలకు పెద్ద పీట వేశారని పలువురు మతపెద్దలు తెలిపారు. మంగళం సప్తగిరినగర్ పంచాయతీ అధ్యక్షులుగా మహ్మద్‌కాసీమ్, రజాక్‌ను నియమించడమే ఇందుకు నిదర్శనమన్నారు. శుక్రవారం సప్తగిరినగర్ పంచాయతీలో మహ్మద్‌కాసీమ్, రజాక్‌తో పాటు సప్తగిరినగర్, రణధీర్‌పురం పంచాయతీల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్‌లు లక్ష్మీనారాయణ, అశోక్‌రెడ్డిని ముస్లింలు సత్కరించారు. టీడీపీ హయాంలో ముస్లింలకు పదవులు ఇవ్వలేదని తెలిపారు. మార్కెట్‌యార్డ్ డైరెక్టర్‌గా, పంచాయతీ అధ్యక్షులుగా ఉన్నత పదవులను కల్పించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటామని చెప్పారు.

త్వరలో ఎస్వీడబ్ల్యూ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి

తిరుపతి సిటీ: పద్మావతీ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలకు త్వరలో స్వయం ప్రతిపత్తి హోదా లభించనుందని టీటీడీ విద్యాశాఖ అధికారి భాస్కర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎస్వీడబ్ల్యూ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శుక్రవారం 72వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళాశాల జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించిందన్నారు. ఇక్కడ ఎంతో మంది విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలు అందుకున్నారని తెలిపారు. గత టీటీడీ ఈవో జవహర్‌రెడ్డి, ప్రస్తుత ఈవో ధర్మారెడ్డి, జేఈవో సదాభార్గవి సహాయ సహకారాలతో కళాశాల న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించిందన్నారు. ప్రిన్సిపాల్ మహాదేవమ్మ మాట్లాడుతూ ఈ కళాశాల నుంచి ప్రతి ఏటా సుమారు 1200 మంది విద్యార్థినులు డిగ్రీ పట్టాలు పొందుతున్నారని తెలిపారు. సివిల్ ఇంజినీర్ దామోదరం, విశ్రాంత ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి, పీఆర్‌వో రవి, అధ్యాపకులు భువనేశ్వరి, ఏవీలత, ఉమాదేవి, ఉమారాణి, లక్ష్మి పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం


అన్నదానం చేస్తున్న బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): మూలస్థాన ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి తిరుపతికి చెందిన శ్రద్ధ డెవలపర్స్ అధినేతలు కృష్ణమూర్తి, బాలాజీ కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. నగదును శుక్రవారం ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డికి అందజేశారు. అంతకు ముందు దేవదాయ శాఖ, టీటీడీ అధికారులతో ఆలయ పునర్నిర్మాణ పనులపై సమావేశం నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో 21న నిర్వహించే బాలాయణం తర్వాత పునర్నిర్మాణం చేపడతామన్నారు. అనంతరం చంద్రగిరి ఎంపీటీసీ బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి దాతృత్వంతో దాదాపు వెయ్యి మంది భక్తులకు అన్నదానం చేశారు. ఎంపీటీసీ మాధవరెడ్డి, చంద్రగిరి పట్టణ కన్వీనర్ పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, మోహన్, కోటేశ్వర్‌రెడ్డి, వేమారెడ్డి పాల్గొన్నారు.

బలిజ భవన్ నిర్మాణంలో భాగస్వాములవ్వండి

తిరుపతి కల్చరల్: బలిజ భవనం నిర్మాణంలో పార్టీ లకతీతంగా భాగస్వాములు కావాలని బలిజ జేఏసీ అధ్యక్షుడు నీలం బాలాజీ, ఆర్కాట్ కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. వారు శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎల్ఐసీ రోడ్డులోని బలిజ భవన్ స్థలాన్ని ఆక్రమణల నుంచి కాపాడుకుని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తన సొంత నిధులు రూ.5 లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టామన్నారు. త్వరలో బలిజ భవన్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించనున్నట్లు కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు తెలిపారని పేర్కొన్నారు. అందరూ భవన నిర్మాణానికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

28న యాదవ భవన నిర్మాణానికి భూమి పూజ

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని రామతులసీ కల్యాణ మండపం సమీపంలో యాదవ భవన నిర్మాణానికి 28వ తేదీన భూమి పూజ చేపట్టనున్నట్టు వాసుదేవ యాదవ సేవా సంఘం అధ్యక్షుడు మునస్వామి యాదవ్ తెలిపారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో యాదవ భవన నిర్మాణం, భూమి పూజ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 2011లో ఏర్పాటైన వాసుదేవ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో యాదవులు రాజకీయ పార్టీలకు అతీతంగా ఏక తాటిపైకి వచ్చారని తెలిపారు. అందరూ కలిసి 150 అంకణాల స్థలంలో యాదవ భవనం నిర్మాణం చేపట్టేందుకు నిర్ణయించినట్లు తెలిపారు.

బీసీ మహిళకు న్యాయం చేయాలని నిరసన

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ చేపట్టిన కారుణ్యా నియామకాల్లో బీసీ మహిళకు అన్యాయం జరిగిందని, ఆమెకు న్యాయం చేయాలని ట్రైబల్ స్టూడెంట్ యూనియన్, గిరిజన సంఘాల నాయకులు డిమాండు చేశారు. వారు శుక్రవారం వీసీ ఛాంబర్ ఎదుట నిరసన తెలిపి వీసీ కృష్ణమూర్తికి వినతి పత్రం సమర్పించారు. విద్యాపీఠం అధికారులు ఎస్సీ, ఎస్టీ, బీసీ రోస్టర్ విధానాన్ని పాటించడం లేదని విమర్శించారు. వెంటనే స్పందించి బీసీ మహిళకు న్యాయం చేయాలని కోరారు. ఆ సంఘం అధ్యక్షుడు అక్కులప్ప పాల్గొన్నారు.

బహుజనుల ఆత్మగౌరవాన్ని కాపాడండి

తిరుపతి కల్చరల్: దేశంలో దళితులు, బహుజనులపై జరుగుతున్న దాడులను అరికట్టి వారి ఆత్మగౌరవాన్ని కాపాడాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతమాకుల పుణ్యమూర్తి కోరారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ మనువాదుల పాలనలో దళిత, గిరిజన, బహుజనులు మాన ప్రాణాలను కోల్పోతున్నారని ఆరోపించారు. ప్రమాదంలో ఉన్న భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత బహుజనులపై ఉందన్నారు. దాడులను నిరసిస్తూ ఆత్మగౌరవ ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. అంతకు ముందు కరపత్రాలు ఆవిష్కరించారు.